మెనూ.. మరింత మెరుగ్గా

- అంగన్‌వాడీ కేంద్రాల్లో రుచికర, పోషకాలు కలిగిన భోజనం
- చార్జీలు పెంచిన ప్రభుత్వం


అంగన్ వాడీ కేంద్రంలో తింటున్న చిన్నారులు

కొల్లిపర: అంగన్‌వాడీ కేంద్రాల్లో 'మెనూ' మరింత మెరుగ్గా అమలవుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల్లో అనేక మార్పులు తీసుకొచ్చారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. అలాగే ఉన్నతాధికారుల పర్యవేక్షణలో మెరుగైన సేవలు కల్పిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలిస్తోంది. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా కూరగాయలు, ఆకు కూరలతో కూడిన పౌష్టికాహారం అంగన్‌వాడీల్లో అందిస్తున్నారు. నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో, మెనూలో లోటుపాట్లు తలెత్తకుండా మెనూ చార్జీలను పెంచారు. గతంలో ఒక్కో బాలింత, గర్భిణికి రూ.3లు చెల్లిస్తుండగా.. ఆ ధరను రూ.5.77లకు ప్రభుత్వం పెంచింది. అలాగే చిన్నారులకు ఒక్కొక్కరికీ రూ.1.70 అందిస్తుండగా, ఈ మొత్తాన్ని రూ.2.10లకు పెంచడం జరిగింది. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిక్కీలు, ఖర్జూరం, అటుకులు, జొన్న పిండి, రాగి పిండితో కూడిన కిట్లను ప్రభుత్వం అందిస్తోంది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లా ఉన్నతాధికారులు దగ్గర నుంచి కిందిస్థాయి అధికారుల వరకు మెనూను పక్కాగా అమలు చేసేలా పర్యవేక్షిస్తున్నారు. అంగన్‌వాడీల్లో ఐదు రోజుల పాటు కోడిగుడ్లు , పాలు, రోజూ రకరకాల వంటలతో పౌష్టికాహారం అందుతోంది. అలాగే సూపర్ వైజర్లు, సీడీపీఓలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

భవనాల అద్దె పెంపు..

తెనాలి నియోజకవర్గంలో 144 అగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 45 సొంత భవనాల్లో, 45 సామాజిక భవనాల్లో, 54 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. గతంలో అద్దె తక్కువ కావడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు అన్ని సదుపాయాలతో కూడిన భవనాలను ఇచ్చేందుకు యజమానులు నిరాకరించేవారు. తప్పనిసరి పరిస్థితుల్లో వసతి లేని, ఇరుకు గదుల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాల్సిన దుస్థితి. ఇకపై ఆ సమస్య లేకుండా అంగన్‌వాడీ భవనాలకు చెల్లించే అద్దెను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కేంద్రాలకు గతంలో రూ.1000 ఇవ్వగా, దాన్ని రూ.2000లకు పెంచింది. పట్టణ ప్రాంతాల్లో రూ.4వేల నుంచి రూ.6వేలకు అద్దె చెల్లిస్తున్నారు.

నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలు : 144

చిన్నారులు :	6,199
గర్భిణులు :	650
బాలింతలు :	642

మెనూ ఇలా..

సోమవారం: అన్నం, దోసకాయ పప్పు, కోడిగుడ్డు కూర, పాలు.

మంగళవారం: అన్నం, టమాట పప్పు, కోడి గుడ్డు కూర, పాలు, పిల్లలకు పులిహోర.

బుధవారం: అన్నం, ఆకు కూర పప్పు, కోడిగుడ్డు కూర, పాలు.

గురువారం: ఎగ్ ఫ్రైడ్‌రైస్, ఆకుకూర, కూరగాయలతో సాంబారు, పాలు, పిల్లలకు అన్నం.

శుక్రవారం: అన్నం, బీరకాయ లేదా సొరకాయ పప్పు, మునగాకు లేదా పాలకూరతో గుడ్డుకూర, పాలు.

శనివారం: వెజిటబుల్ రైస్, ఆకుకూర, కూరగాయలతో సాంబారు, కోడిగుడ్లు, పాలు.

మెనూ చార్జీలు పెంపు.. సంతోషకరం



అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ చార్జీలను పెంచడం సంతోషకరం. గతంతో కూరగాయల ధరలు, రవాణా చార్జీలు పెరిగాయి. పాత మెనూ చార్జీలు ఇబ్బందులు పడేవాళ్లం . ప్రభుత్వం చార్జీలు పెంచి మాకు ఊరట కల్పించింది.

– షేక్ షహేద, అంగన్‌వాడీ కార్యకర్త, కొల్లిపర 3

హర్షణీయం



పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచడం హర్షణీయం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎన్నడూ లేని విధంగా పౌష్టికాహారం అందిస్తున్నారు. పౌష్టికాహారం ఇవ్వటం వల్ల ఎక్కువ మంది సద్వినియోగం చేసుకుంటున్నారు.

– హెచ్.లక్ష్మీకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త, అత్తోట

పక్కాగా అమలు చేస్తున్నాం



ప్రభుత్వం ఆదేశాల మేరకు మెనూను పక్కాగా అమలు చేస్తున్నాం. ఉన్నతాధికారులు ప్రతిరోజూ సమాచారం తీసుకుంటున్నారు. ప్రతి రోజూ ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్నాం.

– వై.నాగమణి, సూపర్‌వైజర్, కొల్లిపర సెక్టార్

గాయకుడు సత్యనారాయణకు సన్మానం


సత్యనారాయణను సన్మానిస్తున్న పూర్ణచంద్, చక్రవర్తి

తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం యమగోల చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు, రేడియో టీవీ ఆర్టిస్ట్, గాయకుడు వెంపటి సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈదర వెంకట పూర్ణ చంద్, ఆవుల చక్రవర్తి, కాకుమాను సత్యం, పోపూరి రామమోహనరావు, కొరటాల జ్ఞానేంద్ర ప్రసాద్, కనగాల వెంకటేశ్వర రావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమవరపు సాంబశివరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, పెమ్మసాని పోతురాజు, ఈదర శ్రీనివాసరావు, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, చేపూరి సాంబశివరావు, కోగంటి వెంకటేశ్వరరావు, శాఖమూరి చలపతిరావు, ఉమ్మలనేని ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రికి మాజీ సైనికుల వినతి


హోం మంత్రి వనితకు వినతిపత్రం ఇస్తున్న మాజీ సైనికులు

తెనాలి: మాజీ సైనికుల సంఘానికి చెందిన నాయకులు శుక్రవారం రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనితను కొవ్వూరులో కలిశారు. మాజీ సైనికుల సంఘ కార్యాలయ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తెనాలికి చెందిన మిలటరీ ప్రసాద్‌తో కలిసి మాజీ సైనికుల యూనియన్ జాతీయ అధ్యక్షుడు ఎం.శంకరరావు, ప్రధాన కార్యదర్శి ఎం.హెచ్ఆర్ గుప్త, కోశాధికారి జి.తిరుపతిరావు వినతిపత్రాన్ని మంత్రికి ఇచ్చారు. దేశం కోసం పోరాడిన మాజీ సైనికులకు సంఘ భవనం ఆవశ్యకతను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి తానేటి వనిత సైనికులంటే తనకెంతో గౌరవం ఉందంటూ, కార్యాలయ భవనానికి అనువైన స్థలం గుర్తించాలని, సంబంధిత అధికారులతో మాట్లాడి భవనం మంజూరుకు కృషిచేస్తానని హామీనిచ్చినట్లు మిలటరీ ప్రసాద్ తెనాలిలో విలేకరులకు తెలియజేశారు. ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు జిల్లాల్లో అనువైన స్థలాన్ని తమ సంఘ నాయకులు మంత్రికి తెలియజేస్తారని, అనంతరం భవన నిర్మాణానికి ముఖ్యమంత్రిని కలిసి సాయం కోరతామని వివరించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తెనాలిటౌన్: మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని, మండలాన్ని అభివృద్ధి పథంలో ఉంచాలని ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు పేర్కొన్నారు. కొత్తపేటలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించి, మాట్లాడారు. జగనన్న కాలనీల్లో రోడ్లు, వీధిలైట్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీఓ ఎల్.విజయాలక్ష్మణ్ మాట్లాడారు. గత సమావేశంలో వివిధ అభివృద్ధి పనుల తీర్మానాలను కొనసాగిస్తూ కొత్త పనులు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. జడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకం కింద ఉపకార వేతనాలకు సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ నిధుల ద్వారా రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ జీవో జారీ చేసిన తరువాత మొక్కజొన్న కొనుగోలు ఏర్పాటు కు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్బీకేల్లో జనుము, పిల్లి పెసర విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బడిమానేసిన పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. వీ లవ్ లెర్నింగ్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నంది వెలుగులోని విద్యుత్ లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పవన్ కుమార్, ఎంపీటీసీ సిలార్ జానీ కోరారు. దీనిపై ఎలక్ట్రికల్ ఏఈ వసంతరావు స్పందిస్తూ.. సంబంధిత అధికారులకు నివేదిక అందజేసినట్లు చెప్పారు. వేసవిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరా రు. గ్రామాల్లో కొత్త విద్యుత్ స్తంభాల కోసం పంచాయతీలో తీర్మానం చేయించాలన్నారు. కొలకలూరు ఫ్లై ఓవర్‌పై నాలుగు నెలల నుంచి రాత్రిళ్లు లైట్లు వెలగడం లేదని, ఫ్లై ఓవర్ ఏ పంచాయతీ పరిధిలో ఉందో తెలియజేయాలని కొలకలూరు ఎంపీటీసీ-2 సభ్యుడు కాలిశెట్టి ఫణికుమార్ అధికారులను కోరారు. జగనన్న కాలనీలో గృహ నిర్మాణం గురించి హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, రోడ్ల నిర్మాణాన్ని పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరరావు వివరించారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యులు మైలా భానుప్రసాద్, ధర్మరాజుల చెన్నకేశవులు, సర్పంచ్‌లు చొప్పర ప్రీతి, ధూళిపాళ్ళ పవన్‌కుమార్, చందు శాంతికుమార్, తలమాల యర్రయ్య, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

తెనాలిరూరల్: బైక్ చోరీపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన మొవ్వ వినీల్ ప్రైవేటు కొరియర్ సంస్థలో పని చేస్తున్నాడు. ఈ నెల 24న నాజరుపేట తోటవారి వీధి-1లో కొరియర్ డెలివరీ ఇచ్చేందుకు వెళ్లాడు. వాహనాన్ని రోడ్డు వెంబడి నిలిపి ఇంట్లోకి వెళ్లి రాగా బైక్ కనిపించలేదు. గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను శుక్రవారం ఆశ్రయించాడు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మేటిగా వివేక విద్యా సంస్థలు

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్యే శివకుమార్, వీరనారాయణ

తెనాలి: తెనాలి కేంద్రంగా నడుస్తున్న వివేక విద్యా సంస్థలు ఇంటర్మీడియట్ విద్యలో మేటిగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. ఉన్నత ప్రమాణాలతో విద్యనందిస్తూ రాష్ట్రస్థాయి ఫలితాలను సాధిస్తుండటం గొప్ప విషయమని కొనియాడారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వివేక విద్యా సంస్థల విద్యార్థుల అభినందన సభను శుక్రవారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూలు ఆడిటోరియంలో నిర్వహించారు. సభకు డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే శివకుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. విద్యాసంస్థలను ఉత్తమంగా నడపటం కత్తిమీదసాములాంటిదన్నారు. అందుకు నిర్విరామంగా కృషిచేస్తున్న డాక్టర్ వీరనారాయణను అభినందించారు. జీవితం ఎవరికీ వడ్డించిన విస్తరి కాదని, అవకాశాలు వచ్చినపుడు సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు ఎమ్మెల్యే సూచించారు. డాక్టర్ వీరనారాయణ మాట్లాడుతూ సీనియర్ ఇంటర్‌లో తమ విద్యార్థులు ఇద్దరు 986 మార్కులు సాధించగా, 112 మంది విద్యార్థులు 900 పైగా మార్కులతో ఉత్తీర్ణులైనట్టు చెప్పారు. జూనియర్ ఇంటర్‌లో 470 మార్కులకుగాను ఇద్దరు విద్యార్థులు 464 మార్కులు తెచ్చుకోగా, మొత్తం 132 మంది విద్యార్థులు 400 పైగా మార్కులు సాధించటం గర్వకారణమన్నారు. అనంతరం సీనియర్ ఇంటర్‌లో 986 మార్కులు సాధించిన పావన లక్ష్మీదేవి, నందినిదుర్గా, బైపీసీలో 985 మార్కులు తెచ్చుకున్న షబ్నమ్, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 464 మార్కులు సాధించిన సాయిచంద్రిక అంజలి, కె.అనుదీప్తిని ఎమ్మెల్యే శివకుమార్ సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. సీఈవో రావిపాటి ఉదయ్‌కిరణ్, ప్రిన్సిపల్ కేవీ బ్రహ్మం, కో-ఆర్డినేటర్ సత్యప్రసాద్, నర్రా శ్రీనివాస్, మురళి, ఠాగూర్, రాంబాబు పాల్గొన్నారు.

మార్కెట్ సెంటర్‌లో చలివేంద్రం



తెనాలిటౌన్: పట్టణ ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల సంయుక్తంగా మార్కెట్ సెంటర్‌లో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ పట్టణ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజలకు, బాటసారులకు మజ్జిగ అందజేశారు. కంకిపాడు రమేష్ కుమార్, తూనుగుంట్ల సుబ్బారావు, యడవలపాటి వాసు, కోలా గురునాథగుప్తా, చుండూరు సాయి, ఎంఎస్ఆర్ గుప్తా, శేఖర్, ఎం.పూర్ణచంద్రరావు, కె.నాగేశ్వరరావు, కె.రఘునాథ గుప్తా, జవ్వాజి శ్రీనివాసరావు, కొండవీటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

తెనాలిరూరల్: తెనాలి కొత్తపేటలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రెవెన్యూ విభాగ అధికారులు, సిబ్బంది కలిసి కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ కె. రవిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌తో పాటు సీఎస్‌డీటీ మూర్తి, రేషన్ డీలర్ల సంఘ నాయకులు కోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

15లోగా రేషన్ పంపిణీ పూర్తి చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రవిబాబు

తెనాలిరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిధిలోని ఎండీయూ, రేషన్ డీలర్లతో తహసీల్దార్ కె.రవిబాబు సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ రేషన్ పంపిణీపై ఎండీయూలకు పలు సూచనలు చేశారు. 15వ తేదీలోగా రేషన్ పంపిణీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరిగేలా చూడాలని చెప్పారు. కొన్ని చోట్ల ఎండీయూలు లేకపోవడంతో డీలర్లు, వీఆర్వోలతో సమన్వయం చేసుకుని రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. సీఎస్‌డీటీ మూర్తి పాల్గొన్నారు.

రేపట్నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


ఆరాధనోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

తెనాలిటౌన్: కఠెవరం గ్రామంలోని రాజులపాలెంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం నుంచి మే 6వ తేదీ వరకు ఆరాధనోత్సవాలు, గురుపూజ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆత్మనంద సేవా సమాజం ఆధ్వర్యంలో ఉత్సవాలు వారం పాటు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పోసపాటి శ్రీనివాసరాజు, పోసపాటి మాలకొండం రాజు, సభ్యులు కంపరాజు వెంకట సాంబశివరాజు, కృష్ణంరాజు, గ్రామ ఉప సర్పంచ్ మంచాల సురేష్, బొమ్మిశెట్టి దుర్గా ప్రసాద్, నాగం ఏడుకొండలరావు, భూమరాజు వెంకంరాజు, వ్యాసం సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పవర్ లిఫ్టర్లకు అభినందన



తెనాలి: విశాఖపట్నంలో ఈ నెల 22, 23 తేదీల్లో జరిగిన 10వ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన స్థానిక కేవీబికే జిమ్ క్రీడాకారులను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభినందించారు. సబ్ జూనియర్ బాలికల విభాగం 43 కిలోల కేటగిరీలో తలపడిన మధిర షామాన్ బంగారు పతకం సాధించగా, సబ్ జూనియర్ బాలుర విభాగంలో కందిమళ్ల గుణశేఖర్ 83 కిలోల కేటగిరీలో రజతం సాధించినట్లు కోచ్ ఘట్టమనేని సాయిరేవతి, పూసపాటి శివరామ కిరణ్‌రాజు వెల్లడించారు. వీరిద్దరూ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. శుక్రవారం జిమ్‌లో ఎమ్మెల్యే శివకుమార్ వీరిరువురిని సత్కరించి, జాతీయ పతకాన్ని కైవసం చేసుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. వీరితో జిమ్ నిర్వాహకులు కొమ్మినేని భార్గవ్‌కుమార్ ఉన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



మున్నంగి(కొల్లిపర): క్రమశిక్షణతో విద్యను అభ్యసించిన విద్యార్థికి మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రధానోపాధ్యాయిని వంగా దీపలత పేర్కొన్నారు. శుక్రవారం మున్నంగి ప్రాథమిక పాఠశాల(ఆర్)లో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సాయంత్రం ఎండ తీవ్రత తగ్గిన తరువాత ఆటలు ఆడుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉచితంగా క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. విద్యలో ప్రతిభ కనబరిచిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. బాలబాలికలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ మున్నంగి సామ్రాజ్యం, టీచర్ రాము, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తైవాన్ స్ప్రేయర్ల పంపిణీ



తెనాలిటౌన్: నంది వెలుగు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద 10 మంది రైతులకు తైవాన్ స్ప్రేయర్లను సర్పంచ్ ధూళిపాళ్ళ పవన్ కుమార్ పంపిణీ చేశారు. రైతులు వీటిని వినియోగించుకోవాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో వీఏఏ మౌనిక, కన్వీనర్ తోట పూలేశ్వరరావు, కో-కన్వీనర్ తాడిబోయిన వెంకటేశ్వర్లు, సభ్యులు రమాదేవి, సుజాత, వెంకట్రావు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరలు పంపిణీ



తెనాలిటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి ఆధ్వర్యంలో నాజర్ పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో శుక్రవారం వృద్ధులకు అన్నదానం చేశారు. క్లబ్ సభ్యులు వెచ్చా సాంబశివరావు కోడలు ఆకుల వెంకటలక్ష్మి పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు చీరలను క్లబ్ వ్యవస్థాపకుడు కాకరపర్తి సుబ్రమణ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు మురళి, దాతలు సాంబశివరావు, లయన్ నంబూరు శ్రీకుమార్, జవ్వాజి శ్రీనివాసరావు, భారతి, వెంకటలక్ష్మి, రూప్ కుమార్, ఉదయశంకర్, శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

తాటి ముంజల పంపిణీ



తెనాలిటౌన్: పట్టణంలోని చిట్టి ఆంజనేయస్వామి గుడి ఎదురు శ్రీ భర్గుల్లేశ్వర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రంలో మజ్జిగతో పాటు తాటి ముంజలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సున్నం ఉమామహేశ్వరరావు, ముదిగొండ సాయిప్రచేత, కోనేరు వేణుగోపాల్, గుమ్మడి శ్రీనివాస్, మస్తాన్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

30న కేశవరెడ్డి నవలలపై చర్చావేదిక

తెనాలి: పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఈ నెల 30న డాక్టర్ కేశవరెడ్డి గారి నవలలు 'చివరి గుడిసె', 'మూగవాని పిల్లనగ్రోవి'పై చర్చా కార్యక్రమం జరగనుంది. గాంధీ నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సాయంత్రం 6 గంటలకు నిర్వహించే సభకు సమన్వయకర్తగా కేవీ రాఘవరెడ్డి వ్యవహరిస్తారు. నాగార్జున యూనివర్సిటీ ఆచార్య వి.అంజిరెడ్డి, సాహితీ విమర్శకుడు అంబటి సురేంద్రరాజు చర్చను ప్రారంభిస్తారు. ఆహ్వానం మాస పత్రికను సాహితీ విలువలతో నిర్వహించి, పత్రిక పేరు ఇంటి పేరుగా మారిన 'ఆహ్వానం లక్ష్మి' ఈ నెల 17న కన్నుమూసిన విషయం విదితమే. ఉత్తమ సాహిత్యానికి మాత్రమే పత్రికలో చోటు కల్పించి, ఎందరో ఉత్తమ రచయితలు వెలుగులోకి వచ్చేలా ప్రోత్సాహం అందించిన లక్ష్మి సంస్మరణగా ప్రతి నెల చర్చా కార్యక్రమ నిర్వహణకు భిన్నస్వరాలు కార్యవర్గం నిర్ణయించింది. తొలి వేదికను 30న ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు ప్రకటించారు.

శ్లాబు పనులు పరిశీలన


పరిశీలనలో జెడ్పీటీసీ ఉమాప్రణతి

తెనాలిటౌన్: కొలకలూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణానికి శుక్రవారం శ్లాబ్ వేశారు. ఈ పనులను జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమా ప్రణతి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. నాడు-నేడు పథకం ద్వారా హై స్కూల్‌లో రూ.36లక్షలతో అదనపు తరగతి గదిని నిర్మించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పినపాటి అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు ఎస్.శోభాదేవి, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, అన్నారావు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అపోహలొద్దు.. ఇళ్లు నిర్మించుకోండి


లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈ

కొల్లిపర: జగనన్న లే అవుట్లల్లో ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందని లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు సూచించారు. శుక్రవారం స్థానిక జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఇప్పటికే లే అవుట్లలో కరెంట్, నీటి సదుపాయం, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించిందన్నారు. లబ్ధిదారులు అపోహలు లేకుండా గృహ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ కఠారి, పంచాయతీ కార్యదర్శి భార్గవ, భీమవరపు సంజీవరెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.